క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా ముదిరాజ్ సేవా సంఘం వారు వ్యవహరించారు. ఉదయం ఆకు పూజ, అభిషేకాలు, పూజలు, మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పశుగణన పక్కాగా జరగాలి



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఇందుకూరుపేట : జాతీయ పశుగణన పక్కాగా జరగాలని, ఈ మేరకు క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వి.కోటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని ఏడీ కార్యాలయంలో డాక్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు పశుగణనపై శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పశుగణన ఆధారంగా ప్రభుత్వం పాడి అభివృద్ధికి మరింత చర్యలు చేపడుతోందన్నారు. పశు బీమా, మినీ గోకులం, పశు కిసాన్ కార్డులు, వ్యాధి నిర్మూలన టీకాలు తదితర అంశాలపై జేడీ సమీక్షించారు. కార్యక్రమంలో నెల్లూరు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నాగమణి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ముంజునాథ్, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు మండలాల పశుసంవర్ధకశాఖ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి



హర్‌ఘర్ తిరంగ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ప్రసన్నలక్ష్మి అన్నారు. పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగ' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవడం, విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పరుచుకోవడం చేయాలని సూచించారు. భారతదేశానికి శక్తివంతమైన మానవ వనరులుగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ దిలీప్‌కుమార్, హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గంగవరంలో రక్తదాన శిబిరం



కోవూరు : మండలంలోని గంగవరం గ్రామంలో మురారి మనోజ్‌కుమార్ సేవాసమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, సర్పంచి ఏడెం లక్ష్మీకుమారి, పార్టీ నేతలు శ్రీధర్ నాయుడు, మోషే, శివకుమార్, మల్లికార్జున, మురారి అశోక్, మన్నేపల్లి అంకోజీ పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి



పొదలకూరు : మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.సారంగపాణిని తాటిపర్తి వైఎస్సార్‌సీపీ నాయకుడు పాములూరు లచ్చారెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువ కప్పి సత్కరించి తాటిపర్తిలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరారు.

ఆకుకూరల సేద్యం.. ఆదాయ మార్గం

తక్కువ పెట్టుబడి.. అధిక రాబడి

వస్తుండటంతో ఆకుకూరల సాగుపై చిన్న, సన్నకారు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. సాధారణంగా తక్కువ భూమి ఉన్న రైతులు, కౌలుకు తీసుకుని సాగు చేసే రైతులు ఈ పంటలను ఎక్కువగా పండిస్తున్నారు. దీనికితోడు ఆకుకూరల పంట అన్నికాలాల్లో స్వల్ప వ్యవధిలో చేతికి వస్తుంది. అదేవిధంగా ఆకుకూరల్లో పోషకాలు అధికంగా ఉండటంతో ఎక్కువ మంది వీటిని కొనుగోలు చేస్తుంటారు.

- పెన్నా తీరంలో విస్తరిస్తున్న ఆకుకూరల సాగు
- అదను కాని రోజుల్లోనూ లాభాల పంట
- తక్కువ పెట్టుబడితో మంచి రాబడి
- రైతులే వ్యాపారులుగా మారి విక్రయిస్తున్న వైనం
- మార్కెట్లో ఫుల్ డిమాండ్

కోవూరు : నియోజకవర్గ పరిధిలోని పెన్నా పరిసర ప్రాంతం ఆకుకూరల సాగుకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. కోవూరు, విడవలూరు, ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం మండలాలను ఆనుకుని ఉన్న ఇసుక నేలల్లో నన్న, చిన్నకారు రైతులు ఆకుకూరలను సాగు చేస్తూ ఆనందంగా జీవిస్తున్నారు. వరి కోతల తర్వాత ఆకుకూరల సాగు చేపట్టి ఆరు నెలల పాటు అదను కాని రోజుల్లో కూడా రోజువారి సంపాదనపై దృష్టి పెడుతున్నారు. పలు గ్రామాలకు చెందిన రైతులు చిన్నచిన్న కమతాల్లో ఆకుకూరలను సాగు చేస్తున్నారు. పది మంది రైతులు కలిసి 2 లేదా 3 ఎకరాలను కౌలుకు తీసుకుని, కమతాలుగా విభజించుకుని వివిధ రకాల ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పండించే ఆకుకూరల్లో ముఖ్యంగా తోటకూర, బచ్చల కూర, పాలకూర, చుక్కకూర, గోంగూర, కొత్తిమీర, పాదీన, కరివేపాకు ఉన్నాయి. సాయంత్రం పూట కోసిన ఆకుకూరలను రైతులు తమ మోపెడ్ బైక్‌లు ఆటోల్లో, మహిళలు తట్టలతో గ్రామాల్లో విక్రయిస్తున్నారు. కొందరు రైతులు దగ్గరలోని కోవూరు, నెల్లూరు రైతు బజారులో విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నారు.



విస్తారంగా సాగులో ఉన్న వివిధ రకాల ఆకు కూరలు



పాలకూరను కట్టలు కట్టి తీసుకెళ్తున్న రైతు సుబ్రహ్మణ్యం

తాజాదనం కోరుకునే వారు నేరుగా వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి ఆకుకూరలు తెచ్చుకుంటున్నారు. పెళ్లిళ్ల సీజన్‌లో ఆకు కూరలకు డిమాండ్ ఉంటుంది. కూరగాయల ధరలు ఆకాశన్నంటిన రోజుల్లో చౌకగా లభించడంతో ఆకుకూరలు వినియోగదారుల మెనూగా మారాయి.

రోజువారీ జీవనోపాధి



ఆకుకూరలు కోస్తున్న కూలీలు

కోవూరు మండల పరిధిలోని వివిధ రకాల పంటలను సాగు చేసే రైతులు సుమారు 800 మంది వరకు ఉంటారు. ఇందులో 107 మంది ఎన్నో సంవత్సరాలుగా ఆకుకూరలను సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వీరు తోటకూర, గోంగూర, బచ్చల కూర, చుక్కకూర, మెంతికూర వంటి పలు రకాల ఆకుకూరలను సాగు చేస్తుంటారు. మండలంలోని పాటూరు, పోతిరెడ్డిరెడ్డిపాళెం, పల్లిపాళెం గ్రామాల్లో పండించిన ఆకుకూరలే కోవూరు పరిసర ప్రాంతాలకు సూర్యోదయంతో వెళ్లి చేరుతుయి. ముఖ్యంగా ఆకు కూరలను పండించే రైతులు ఉదయం వేళల్లో పొలాల్లో వ్యవసాయ కూలీలుగా పనులు చేసుకుంటూ సాయంత్రానికి ఆకు కూరలను సిద్ధం చేసి ఉదయాన్నే వారే ద్విచక్ర వాహనం, ఆటోలపై గ్రామాలకు వెళ్లి విక్రయిస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. వీరంతా చిన్న, సన్నకారు రైతులే. ప్రతి రైతు కేవలం 10 సెంట్ల నుంచి ఒక ఎకరంలోపు మాత్రమే పంట పొలాలను కౌలుకు తీసుకుని ఆకుకూరల సాగు చేస్తూ ఉంటారు. ఈ గ్రామంలో దాదాపు గత 30 సంవత్సరాలుగా ఇదే ఆకుకూరల సాగు చేస్తూ ఎన్నో కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి.

డిమాండ్ ఉంటుంది



ఆకుకూరలకు డిమాండ్ బాగానే ఉంటుంది. పగల హాయిగా పనులు చేసుకుంటాం. రైతు బజార్లకు, స్థానికంగా ఉన్న కూరగాయల దుకాణాల్లో ఆకుకూరలు విక్రయిస్తాం.పొలంతీసుకుని ఆకు. కూరలు సాగు చేస్తున్నాం. ఏళ్ల తరబడి ఇదే సాగును చేస్తున్నాం. ఉద్యాన వన శాఖాధికారులు ప్రోత్సహిస్తే బాగుంటుంది.

– దండు సుబ్రహ్మణ్యం, రైతు

15 ఏళ్లుగా ఇదే సాగు



గత పదిహేను ఏళ్లుగా ఆకు కూరల సాగు చేస్తూ జీవిస్తున్నా. గ్రామానికి సమీపంలో ఎకరా భూమి ఉంది. దానిలో వివిధ రకాల ఆకుకూరలను సాగు చేస్తున్నా. ఎకరాకు రూ.75 వేల వరకు పెట్టుబడి పెట్టి ఆకుకూరల సాగు చేస్తున్నా. దీనికి తగ్గట్లు ఖర్చులు పోను రాబడి బాగానే ఉంటుంది. ప్రతిరోజు నాతో పాటు కుటుంబ సభ్యులు పొలంలో పనులు చేసుకుంటాం. సాయంత్రానికి ఆకుకూరలను కట్టలు కట్టి, ఉదయాన్నే ద్విచక్ర వాహనంపై గ్రామాలకు వెళ్లి విక్రయించుకుని జీవనం సాగిస్తున్నా.

– వాయలతోట యర్లప్ప, పోతిరెడ్డిపాళెం, ఆకుకూరల రైతు

ఎన్నో ఉపయోగాలు



ఆకుకూరలను తరచూ తీసుకునే కుటుంబానికి ఖర్చులు కూడా తగ్గుతాయి మంచి పోషక విలువలతో కుడిన శక్తి వస్తుంది. కోవూరు ప్రాంతాల్లో స్వచ్ఛమైన ఆకు కూరాలు దొరుకుతాయి. ప్రతిరోజు ఏదో ఒకపూట ఆకుకూరలు తీసుకుంటే మంచిది కంటి చూపు మెరుగుపడుతుంది. ముఖ్యంగా దూరంగా వాహనాలు నడిపే వారికి ఎంతో ఉపయోగం ఉంటుంది.

– నర్సయ్య, పడుగుపాడు, కోవూరు

వీఓఏ తొలగింపుపై మహిళల ధర్నా



ధర్నా చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

- వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

పొదలకూరు : మండలంలోని బిరదవోలు పొదుపు సంఘాల వీఓఏగా గత 23 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వెన్నపూస ఆదిలక్ష్మమ్మను కారణం లేకుండా తొలగించారని పొదుపు సంఘాల సభ్యులు పొదలకూరు వెలుగు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆదిలక్ష్మమ్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాల్సిందిగా పొదుపు మహిళలు డిమాండ్ చేశారు. బిరదవోలు, బ్రాహ్మణపల్లి, కల్యాణపురం, పార్లపల్లి గ్రామాలకు చెందిన మహిళలు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైగా వీఓఏగా ఉత్తమ సేవలు అందిస్తున్న ఆదిలక్ష్మమ్మను ఎలాంటి సమాచారం లేకుండా తొలగించి ఆమె స్థానంలో మరో మహిళను నియమించినట్లు తెలిపారు. ఆమె 48 పొదుపు సంఘాల లెక్కలు చూస్తూ సకాలంలో బ్యాంకు రుణాలు ఇప్పిస్తున్నట్లు చెప్పారు. ఆమె ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు పాల్పడలేదని ఏపీఓ, సీసీ వద్ద ఆధారాలు ఉంటే చూపాల్సిందిగా నినాదాలు చేశారు. అన్యాయంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని వీఓఏను తొలగించడాన్ని తాము సమ్మతించేది లేదని, ఆమె మాకు కావాలని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. వినతిపత్రం అందజేసేందుకు కార్యాలయానికి ఏపీఎం హాజరు కాకపోవడంతో ఆమె వచ్చిన తర్వాత అందజేస్తామన్నారు. ఈ విషయంపై ఏపీఎం రోజ్‌మేరీని ఫోన్‌లో వివరణ కోరగా వీఓఏలను తొలగించడం, కొత్తవారిని నియమించడం వంటి అధికారం తమకు లేదన్నారు.

తొలి దశలోనే తెగుళ్లను నివారించాలి



స్థానిక రైతులతో మాట్లాడుతున్న ఏడీ రాజ్‌కుమార్

ఇందుకూరుపేట : వరిసాగు చేస్తున్న రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, తెగుళ్లను తొలి దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎ.రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని జగదేవిపేటలో మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాండం తొలుచు పురుగు, ఆకు ముడత తెగుళ్లను గుర్తించారు. వాటి నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం

- ఈఓపీఆర్డీ ప్రసాద్



క్షేత్ర పరిశీలన చేస్తున్న సర్పంచ్, అధికారులు

మనుబోలు : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవచ్చని పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళవారం వారు క్షేత్ర పరిశీలన చేశారు. ఇందులో భాగంగా జాతీయ రహదారి పక్కన వీరంపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న మనుబోలు పంచాయతీకి చెందిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తడి చెత్త, పొడి చెత్త, వర్మీ కంపోస్టు, నాడెప్‌ల గురించి వారికి వివరించారు. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో చెత్త నుంచి సంపద తయారీని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మనుబోలు సర్పంచ్ కంచి పద్మమ్మ, ఉప సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శులు చెంచుప్రసాద్, రాజేశ్వరి, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో..



అమ్మవారి సేవలో డాక్టర్ రాజేష్‌శర్మ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని భారత ప్రభుత్వ మంత్రిత్వశాఖ ప్రాంతీయ సలహా కమిటీ చైర్మన్ డాక్టర్ రాజేష్‌శర్మ మంగళవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ఆవరణలో లక్ష్మీగణపతి, శ్రీవల్లీ దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అతిథులను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి అమ్మవారి దర్శనం కల్పించారు. శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, తెలుగుగంగ ప్రాజెక్ట్ డీటీ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

గేదెల చోరీపై ఫిర్యాదు

పొదలకూరు : మండలంలోని బిరదవోలు చెర్లోపల్లి గ్రామానికి చెందిన పాడిరైతు తన గేదెలు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై రామకృష్ణ మంగళవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన వర్ధినేని రామయ్యకు చెందిన నాలుగు గేదెలను గుర్తుతెలియని వ్యక్తుల చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

విడవలూరు : మండలంలోని ముదివర్తి ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక ట్రాక్టర్‌ను తరలిస్తుండగా వావిళ్ల సమీపంలో సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం వేకువజామున స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చుట్టుపక్కల ఆరాతీశారు. మృతుడు ఎరుపురంగు షర్ట్, బులుగు రంగు జీన్స్ ధరించి ఉన్నాడని, వయసు 50 సంవత్సరాల్లోపు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలియజేశారు. కేసు దర్యాప్తు చేసి వివరాలు వెల్లడిస్తామని వివరించారు.

వేగంగా సమస్యల పరిష్కారం



విద్యాకిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

విడవలూరు : మండల పరిధిలో నెలకొన్న సమస్యలను వేగంగా పరిష్కరిస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. స్థానిక పీఆర్‌ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆమె మంగళవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని పలు సమస్యలపై చర్చించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు విద్యా కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, ఎంపీపీ సౌందర్య, స్థానిక నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సత్యంరెడ్డి, వంశీకృష్ణారెడ్డి, భానురెడ్డి పాల్గొన్నారు.

'రంగడి' సన్నిధిలో పవిత్రోత్సవాలు

నెల్లూరు (బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో మంగళవారం పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. సంప్రదాయంగా, శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ అధికారి జె.శ్రీనివాసరావు, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌తో అనేక ప్రయోజనాలు



పొదలకూరు : ఓపెన్ స్కూల్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు



ముత్తుకూరు : మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రత్యూష

పొదలకూరు : చదువుకు దూరమైన వారికి ఓపెన్ స్కూల్‌తో అనేక ప్రయోజనాలు ఉన్నాయని స్టేట్ కో–ఆర్డినేటర్ జేవీ నాగేంద్రరావు అన్నారు. ఓపెన్ స్కూల్ విద్యా విధానంపై మంగళవారం స్థానిక జెడ్పీహైస్కూల్లో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్ 2024–25 విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం ఏపీ సార్వత్రిక విద్యాపీఠం వారు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సామాజిక కారణాల వల్ల విద్యకు దూరంగా ఉన్న వ్యాపారులు, చిరుద్యోగులు, ఆశావర్కర్లు, పొదుపు సంఘాల సభ్యులు, ఏఎన్‌ఎంలు ఓపెన్ స్కూల్ విధానం ద్వారా సెలవు రోజుల్లో కేవలం 30 రోజులు ముఖాముఖి తరగతులకు హాజరు కావచ్చన్నారు. ఓపెన్ స్కూల్ ద్వారా పొందిన సర్టిఫికెట్లు ఇంజినీరింగ్, మెడిసన్ సీట్లు పొందేందుకు అనుమతి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 కె.రేణుక, పాఠశాల హెచ్‌ఎం సనత్‌కుమార్, ఓపెన్‌స్కూల్ కో–ఆర్డినేటర్ సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంతో మేలు

ముత్తుకూరు : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం అమలు చేసే దూర విద్యా విధానం ఎంతో మేలు చేస్తుందని ఎంపీడీఓ ప్రత్యూష అన్నారు. ముత్తుకూరులో మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులకు జరిగిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో మంగళవారం ఎంపీడీఓ పాల్గొని, మాట్లాడారు. మహిళలు, వృత్తి–వ్యాపార రంగాల్లో ఉన్నవారికి, ప్రజాప్రతినిధులకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి దూర విద్య ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. సార్వత్రిక విద్యాపీఠం సమన్వయకర్త నాగేంద్ర, ఎంఈఓ హేమసుందర్, ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ తప్పనిసరి

- ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం



సూచనలిస్తున్న చేస్తున్న ఎంపీడీఓ

కొడవలూరు : నెలలో రెండు సార్లు తాగునీటి ట్యాంకుల్లో విధిగా క్లోరినేషన్ చేయాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పైప్‌లైన్‌లకు లీకేజీలుంటే తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను విధిగా వినియోగంలోకి తేవాలని సూచించారు. మండలంలో 12 సంపద కేంద్రాలు మాత్రమే నిర్మాణం జరిగి ఉన్నందున అవన్నీ వినియోగంలో ఉండాలన్నారు. మిగిలిన పన్నెండు కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, ప్రతి ఇంటికీ కుళాయి(జల్‌జీవన్ మిషన్) కనెక్షన్ అమలుపై జరుగుతున్న సర్వే త్వరగా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో ఈఓపీఆర్డీ వి.డేవిడ్, కార్యాలయ సూపరింటెండెంట్ సురేష్‌కుమార్‌రెడ్డి, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ వి.మనోజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



విద్యార్థులతో కలిసి మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు, నాయకులు

మనుబోలు : మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని మడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని మడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికీకరణ కారణంగా నానాటికీ వాతావరణ కాలుష్యం పెరుగుతోందన్నారు. దీనిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్పి ప్రతి ఇంట్లో కనీసం ఓ మొక్క నాటేలా చేయాలని కోరారు. జనసేన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌బాబు, శ్రీనివాసులు, సాయి, సుధాకర్, ఉపాధ్యాయులు శశశంకర్, మధుసూదన్, శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి జయంతికి ఏర్పాట్లు చేయాలి

నెల్లూరు(బృందావనం): నగరంలో ఏసీ కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వద్ద ఈ నెల 23వ తేదీన జరుగనున్న జయంతికి సంబంధించి తగు ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్‌కు గురువారం విజ్ఞప్తి చేసినట్లు మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ తెలిపారు. తక్షణమే ఆంధ్రకేసరి విగ్రహానికి రంగులువేసి బాగుచేయాలన్నారు. మిత్రుల సహకారంతో జనవరి నాటికి కాంస్య విగ్రహం ప్రతిష్ఠించేందుకు కృషిచేస్తామన్నారు.